# చరిత్రహీన పార్వతి

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

ఎనిమిదిగంటలన్నరయింది. గోపి సత్రంలో భోజనంచేసి బైటికి వస్తున్నాడు. పార్వతి లోపలినుండి సంభ్రమంతో బైటికివచ్చి "గోపీ ఆగండి" అన్నది. సుందరాతి సుందరమైన ఆమె కంఠధ్వనిని విని గోపి వెనక్కు తిరిగాడు. ఆ సత్రం వాకిలి ముందరనున్న దీపస్తంభపు వెలుగులో మెరుపులా మెరిసిపోతోంది పార్వతి. చూచాడు. లోనికిపోయింది. ఆదీపపు స్తంభపు క్రీనీడలో నిలబడ్డాడు. అతనిలో అతను తర్కించుకోడం మొదలు పెట్టాడు. "ఎందుకోసంగా నన్నునుంచోమన్నది" అని. ఎందుకనంటే ఆరేళ్ళనుంచీ ఆమెను ఆ సత్రంలో రోజూ చూస్తున్నాడు. కాని ఓ రోజునా ఆమెతో మాట్లాడలేదు. నలుగురూ ఆమెను గురించి చెప్పుకునే మాటలవల్ల ఆమె స్థితిని కొంచెంగా తెలుసుకున్నాడు. దానివల్ల ఆమె మీద కొంత ఏవగింపుకూడా ఉన్నది. అందుకోసం ఆమె నుంచోమనడంలో కారణం అతనికి బోధపడలేదు. పోనీ! ఆమె ఒంటరిగా ఇంటికి పోలేక సహాయాన్ని అర్థిస్తుందేమో అంటే అదీ కాదు. ఆమె ఇల్లు ఆ సత్రానికి పది గజాల దూరంలోనే ఉన్నది. అతనికేమీ తోచడంలేదు.

పార్వతి లోపలినుండి అందరూ తిన్న విస్తరాకులను తెచ్చి వీధిలో పారేస్తోంది. గోపి ఆమెను చూశాడు. "నీ ఖర్మం ఇంతేలే" అనుకున్నాడు. కాని జాలిచెందాడు. పార్వతి ముఖంమీద పడుతున్న ముంగురులను పైకితోసుకుంటూ కొంచెం ఆయాసంగా "కాస్తాగండి బాబూ; ఇప్పుడే వస్తాను" అని అంటూ శఘంలా లోనికి పోయింది. ఆమె వినయపూరితమైన ఆ మాటను వినడంతోనే అతనిలో తెలియని ఆవేశం కలిగింది. "అసలిక్కడ భోజనం చాకిరీకోసం పెడుతున్నారా ఏమిటి. ఏదో పేదపిల్ల అనే కారణంగా పెడుతున్నారు కాని దిక్కులేంది కదా అని ఈ వెధవ వంట వాళ్లు చేస్తున్న పని. వీళ్ళకు బుద్ధిలేదు. దిక్కులేనిదయినంత మాత్రాన ఈ వెట్టిచాకిరంతా చేయాలని ఉందా! ఔను మరి!" అని నిట్టూర్పు విడుస్తూ "దిక్కులేనివాళ్ళ ఖర్మం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది" అనుకున్నాడు.

పార్వతి నడుముకు బిగించికట్టిన పమిట చెంగును ఊడదీసుకుంటూ వస్తోంది. ఆమె చేతుల గాజులు గలగలా మోగుతున్నయ్యి. ఆ దీపపు వెలుగులో తళతళా మెరుస్తున్నయ్యి. ఆమెనతను వలపుకన్యగా చూచాడు. ఆమె అతని ఎదుటికి వచ్చి "రండి" అని ముందుకు నడిచింది. గోపి కూడా నడిచాడు.

వారిద్దరూ కొంతదూరంలో ఉన్న చెరువు గట్టుకు చేరారు. అక్కడో విశాలమైన పొగడ చెట్టు ఉన్నది. దానిక్రిందకుపోయి "గోపీ! కూర్చోండి, మీతో కొంచెం మాట్లాడాలి" అని అన్నది. గోపి "నీకు నాతో మాట్లాడాల్సినంత అవసరం ఏమున్నది" అని కొంత హేళనగా అనుకుంటూ కూర్చున్నాడు. పార్వతి "గోపీ మీరు ఎల్లుండే ఈ ఊరు నుండి వెళ్ళిపోతారుటగా? నిజమేనా", అన్నది.

"నిజమే ఆమాట. నేను ఎల్లుండి వెళతాను. నాకీఊళ్ళో చదువయిపోయింది" అని అన్నాడు గోపి.

తరువాతెవ్వరూ మాట్లాడలేదు. గోపి ఒకనాడెప్పుడో అనుకున్నాడు "నేను ఈ వూరు నుండి పోయేలోగా పార్వతికి కష్టం కలిగినా సరే ఓమాటను చెప్పాలి" అని ఆమాట ఇప్పుడు గుర్తుకు వచ్చింది. "పార్వతీ! నీకో మాటనుచెప్పాలి కాని నామాట వినడంతోనే ఎఱ్ఱబారిన కళ్లతో నన్ను చూస్తావు. అయినా నీ యోగక్షేమంకోసం చెప్తున్నా" అని తను చెప్పబోయేమాటను ప్రారంభిస్తూ ఉండగానే, పార్వతిచిరునవ్వునవ్వుతూ "మీరెప్పుడూ అట్లా

అనుకోనక్కరలేదు. నాకోసం చెప్పేమాటలు న్యాయమైనవే అయితే నేనెప్పుడూ సిరసా వహిస్తా, అవి కటువుగా ఉన్నా సరే. నా ముఖ ప్రీతికోసం చెప్పే తీపి మాటల్ని మాత్రం ఎన్నడూ సిరసా వహించను. అలా చెప్పే వారిని ఎన్నడూ దూషించను. కనుక నాకు మీరు చెప్పాల్సిన మాటలన్నీ దాపరికం లేకుండా నిష్పాక్షికంగా చెప్పండి" అని అన్నది.

గోపి ఆమాటలకు కొంత చకితుడైనాడు. "నువ్వు నీఇష్టం వచ్చినట్లు ప్రతికొంపా ఎందుకట్లా తిరుగుతావు. నువ్వేం పసిదానివి కాదు. మీ అమ్మ చెప్పిన మాట అసలే వినవుగదా! పైగా ఆమెను తిడతావు. మొన్న ఆ సత్రంలో నీ కోసం ఓ సంబంధం వస్తే నువ్వు తిట్టావు గుర్తున్నదా! ఎందుకు తిట్టాలి. నీ కంతకన్న ఎక్కువ సంబంధం ఎక్కడనుంచి వస్తుందనుకున్నావు? నిన్నే డబ్బు కలవాడూ చేసుకోడు. నా మాట విని ఎవణ్ణో ఒకణ్ణి చేసుకో" అని కొంత తీక్షణంగా అన్నాడు.

ఆ మాటలవల్ల పార్వతి ముఖంలోమార్పేమీ కనుపించలేదు. అస్పష్టంగా చిరునవ్వునవ్వుతూ, "మీరు మా అమ్మ మాటను ఎందుకు వినవు అని అంటారు. నిజమే. మా అమ్మ అందరి తల్లులలాంటి తల్లే అయితే ఆమె మాటను వినడానికేమీ అభ్యంతరంలేదు. అసలు మా అమ్మ సంగతి మీకు తెలుసుననుకుంటాను. అయినా వినండి. మా అమ్మ ఉత్త అమాయకురాలు. ఏమీ తెలియదు. ఎవరేం చెప్తే అదే వింటుంది. రోజూ ఊళ్ళో నీళ్లు పోస్తుంది. పోయించుకున్న వాళ్ళు బిందెకో అర్ధణా యిస్తారు. ఆడబ్బును ఆమె సక్రమంగా వసూలు చేసుకుంటే నెలకు పదిహేను రూపాయలు రావచ్చు. అదైనా సేకరించిన కొంత డబ్బును జాగ్రత్తగా ఉపయోగించుకోలేదు. అది పెట్టి కొనుక్కు తింటుంది. అన్నం ఎక్కడో ఒకచోట తింటుంది. ఒంటినిండా బట్టలు లేవు. తలకు నూనెలేదు. దుబ్బుకట్టి ఉంటుంది తల. ఆమెమీద ఆమెకే జాగ్రత్తలేనప్పుడు మమ్మల్ని ఎక్కడ చూస్తుంది చెప్పండి. నా తమ్ముళ్ళిద్దరూ చూడండి ఎంతసన్యాసులో. చదువుకోమంటే చదువుకోరు. ఆ వంటవాళ్ళ చేత చీపురుదెబ్బలు తింటూ ఆ సత్రంలోనే పడేడుస్తాంటారు. తెలివితేటలు కలదేఅయితే అలా మా అమ్మ చూస్తూ ఊరుకుంటుందా" అన్నది పార్వతి.

గోపి కళ్ళార్పకుండా ఆమె వంకే చూస్తున్నాడు. పార్వతి కొంచెంసేపాగి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది. "మీరు ఆసత్రంలో నన్ను గురించి అందరూ వింతవింతగా అనుకుంటూఉంటే విని ఇలా అని ఉంటారనుకుంటా. నిజమే, మీకేం తెలుస్తుంది. మీరు వస్తారు, అన్నం తింటారు, వెళ్ళిపోతారు. నా నిజాన్ని తెలుసుకునే సావకాశం మీకు ఎలా ఉంటుంది. నేను నిజంగా ఇల్లిల్లూ తిరుగుతూనే ఉన్నాను. మా నాయన చనిపోతూ ఇచ్చిన ఆస్తి ఇంతే." అని కొంత కంట తడిపెట్టుకున్నది. "ప్రపంచంలో పుట్టినవాడు బ్రతకాలి. ఎవరి బ్రతుకు తెరువును వారే చూసుకోవాలి. నాకు బట్టలు కావాలి కట్టుకునేందుకు. తలకు నూనె లేకపోయినా చింపిరి తలతో ఉండగలను. దానికి డబ్బుకావాలి. ఎవరిస్తారు. అందుకోసం ఇంటింటా నీళ్ళను చేరబోసీ అంట్లు తోమీ డబ్బు సంపాదించుకుంటున్నాను. అదీ ఇల్లిల్లూ తిరగటమే అనగలరా! లోకానికి ఆడపడుచు బజారు ముఖం చూడరాదు అనేదే తెలుసు. కాని నాబోటి పేదవనితలకెలా జరుగుతుంది.

"పేదతనం ఒక్క తిండి గుడ్డలకే కాని మానవత్వానికి కాదు. మనిషి మనిషిగా బ్రతకనేర్చినప్పుడు ఎండిపోయిన కడుపులతో బజారులో తిరిగినా ప్రమాదంలేదు. అది లేనప్పుడు నాలుగు బురుజుల మధ్య అంతఃపురంలో పట్టువస్త్రాల చాటులో దాగిఉన్నా ప్రయోజనంలేదు" అని అన్నది.

గోపి పొరబాటుగా అర్థం చేసుకున్నానే అని లోలోన సిగ్గుపడ్డాడు.

పార్వతి కొంచెంసేపు ఊరుకుని "మొన్న నాకో సంబంధం వచ్చింది. మీరు విని ఉండరు, సత్రంలో ఇంకా ఎవ్వరూ వాగలేదు కనుక. ఆయనకు రెండో పెళ్ళట. ఏడెకరాలు పొలమున్నదట. చదువు అంతగా రాదు. ఆయన్ని చేసుకోమని అందరూ అంటారు. కాని నాకు ఇష్టం

లేదండి." అని అన్నది.

"పార్వతీ! నీకట్లాంటి సంబంధంవస్తే ఎందుకు తిరగ్గొట్టావు. నీవెంత సుఖపడేదానివి" అని అన్నాడు గోపి.

పార్వతి కొంచెం ఎగతాళిని సూచిస్తున్న నవ్వునవ్వి "అక్కడ ఎకరాలనో, యోగ్యతనో చేసుకునేది నాకు తెలియడం లేదండి" అని అన్నది.

"ఏం! అట్లా అంటావు."

"ఆయన సంగతి చెప్పడం దేని కనుకున్నా కాని అట్లాంటివాళ్ళ స్థితిని అందరికీ చెప్పాలి. ఆయన మొదటి భార్యను చంపాడు. ఎందుకంటే ఒకరోజున ఆయన తాను ఉంచుకున్న ఆడుదాని దగ్గరికి వెడుతూంటే ఆయన భార్య కన్నీరు కారుస్తూ "ఈ రాత్రయినా ఇంట్లో ఉండరాదా!" అని అన్నదట. ఆయనకు కోపంవచ్చి చెంపమీద కొట్టాడుట. ఆమె చనిపోయింది. చూడండి ఇటువంటి వాళ్ళకు మళ్ళీ పెళ్ళి దేనికండి. ఆమెనుకూడా ఇట్లాగే చంపడానికేగా. ఇవ్వీ! నాకు వచ్చే సంబంధాలు."

గోపికి ఏంచెప్పడానికీ తోచలేదు. "నువ్వు పేదదానివి. పోనీ! అది కాకపోతే ఇంకో పేదైనా చేసుకోరాదా! ప్రతిదానికీ నువ్వు అలా శరంచేస్తే ఎలాచెప్పు. డబ్బు లేనివాళ్లెవరైనా వస్తే "వాణ్ణి చేసుకుని ఏం సుఖపడతావు" అంటావు. అలాంటి సుఖం కావాలంటే డబ్బుండాలి. నీ స్థితి ఏ ఐశ్వర్యవంతుని ఇంటికీ కోడలినిగా చేయదు. రాబోయే కాలం నీకు పశ్చాత్తాపాన్ని కలుగచేస్తుంది కాని సుఖాన్ని ఇవదుకనుక ఎవరోన్న ఒకర్ని చేసుకో"

పార్వతి "నాకు ఐశ్వర్యవంతుని ఇంటికి కోడల్నిగా కావాలనే కోర్కె ఎన్నడూ లేదు. వాళ్ళకు చదువు సంధ్యా అన్నీ ఉన్నా హృదయం మాత్రం ఉండదు. వాళ్ళకు జీవితంలో కావలసింది డబ్బు. దాన్నే కొనుక్కుంటారు. కాని యోగ్యతను మాత్రం కొనలేరు. దాన్ని కొనడానికి వీళ్ళ డబ్బు చాలదు. చూడండి అమావాస్యనాడు నక్షత్రాలు చాలానే కనుపిస్తయి. కాని ఒక్క నక్షత్రానికీ చీకటిని పోగొట్టే శక్తి లేదు. అంతే వాళ్లకున్న డబ్బువిలువ కూడా.

"ఇక పేదవాళ్ళ స్థితి చూడండి. వీళ్ళకు డబ్బు ఉండదు. వీళ్ళజీవితం లోకపుమాపుకు చాలా నికృష్టమైంది. వాడిపోయిన దేహచ్ఛాయతో జీవిస్తారు. వీళ్ళల్లో కూడా హృదయం కలవాళ్ళు చాలా తక్కువ. నా అభిప్రాయం హృదయం కల వ్యక్తి ఒడిలో జీవించాలని. అతనికి డబ్బుండాలనే ఆశ నాకు లేదు. అట్లాంటి వ్యక్తి నాకు లభించకపోతే ఇట్లాగే జీవిస్తాను. లేకపోతే మరణిస్తాను. కాని హృదయం లేని వాళ్ళ గడపముందు కన్నీళ్ళు కారుస్తూమాత్రం జీవించలేను. పేదదాన్నైనంతమాత్రాన నీచానికి దాస్యం చేయాలని లేదు." అని అన్నది.

గోపి ఆమె ప్రౌఢవాదాన్ని చూసి ఆశ్చర్యచకితుడైనాడు. అదివరకు ఆమె ఒక బజారువనిత అయిపోతుందని అనుకున్నాడు. ఇంతయోగ్యత ఇంత జ్ఞానం ఆమెలో ఉందని ఎన్నడూ అనుకోలేదు. "పార్వతీ! నన్నునిజంగా అర్థం చేసుకోకుండా అన్నాను క్షమించు" అన్నాడు.

"ఈ మాత్రానికి నన్ను క్షమాపణ కోరాలా."

క్షణంసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. తరువాత పార్వతి నీరసించిన గొంతుకతో "గోపి! మీరు ఎల్లుండే వెడతా రనుకుంటా. రేపొక్కరోజు మాత్రమే ఉంటారు." అని నిట్టూర్పు విడుస్తూ అన్నది. తరువాత వినిర్మలమైన ఆకాశంలో చంద్రబింబాన్ని చూస్తూ "నేను కాస్త అదృష్టవంతురాలినని చెప్పాలి. ఈ ఒక్క రాత్రయినా మీతో స్వేచ్ఛగా మాట్లాడ్డానికి భగవంతు డనుగ్రహించాడు, అందుకే అనుకుంటూ ఈ వినిర్మలమైన ఆకాశంలో పూర్ణచంద్రుడు ప్రశాంతంగా ప్రకాశిస్తున్నాడు. పాపం! చూడండి. ఆ తుమ్మెదల కెంతదయో మనమీద. అందుకనే గోలచేస్తే మన హృదయాలు ఎక్కడ బాధ పడుతయో అని ఆ కమలపుటీ కోటీరంలో దాక్కున్నయి" అని కొంచెంసేపు మౌనముద్రిత ముఖంతో ఉండి తరువాత చిరునవ్వు నవ్వుతూ, "ఇంత ప్రశాంతమైన రాత్రి మీకో మాటను

చెప్తాను వింటారా!" అని అన్నది.

"చెప్పు" అని అన్నాడు గోపి.

పొంగి పోతున్న హృదయానందంలో "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని లజ్జా నమ్ర ముఖియై అన్నది.

గోపి ముఖం వాలిపోయింది. అతని హృదయంలో ప్రళయం బద్దలైంది. ఆమె అతని ముఖాన్ని చూడ లేదు. "నా నిక్కృష్టమైన జీవితాన్ని మొదటి నుంచీ చూస్తూనే ఉన్నారు. నా జీవితంమీద మీకు విశ్వాసం జాలి. అందుకనే మీ వెలుగు చూస్తూ ప్రశాంతంగా జీవిస్తున్నాను. ఈ తీయని మాటను మీ పాదాల దగ్గిర అర్పించుకోడానికి ఎన్నో రోజులనుంచి చాతక పక్షిలా ఎదురు చూశాను. అది ఫలించింది. గడచిన రోజుల్లో నేను కట్టుకున్న భవనాలన్నీ" అని ఇంకా ఏమో అనబోతోంది. గోపి ముఖం నుండి రెండు అశ్రుబిందువులు ఆమెను క్షమార్పణ కోరుతున్నట్లుగా ఆమె పాదాల మీద పడ్డయ్. అవి వెచ్చగా ఉన్నయ్. పార్వతి హఠాత్తుగా అతని ముఖాన్ని చూసింది. అతని ముఖం వాడిపోయింది. కంటినిండా కన్నీరు. ఆమె పెదవుల్లో చిరునవ్వు జీర్ణించింది. కదిలిపోతున్నయ్. భావశూన్య అయింది. ప్రకృతంతా నిర్మలంగానే ఉన్నది కాని వారికి మాత్రం అంధకారంగా ఉన్నది.

గోపి ఆమె హృదయానికి నెప్పి కలుగకుండా తన స్థితిని ఎలాగ చెప్పడం అనే బాధపడుతున్నాడు. ఆమె హృదయం ఏవిధంగా చెప్పినా ఏడుస్తుంది. ఎన్నో రోజుల నుండీ ప్రతి అణువులోనూ దాచుకున్న వలపును ఈ ఒక్కనాడు ఎలా మరల్చుకో గలదు? అసంభవము. కాని చేయగలిగింది లేదు. "నన్ను సోదరుణ్ణిగా భావించు చెల్లీ" అని అన్నాడు.

ఆమె దిక్కు మాలినదే అయింది. ఆమె తన హృదయంలో దాచుకున్న వలపంతా ఎండమావులా అయిపోయింది. తలలో ఆమె పెట్టుకున్న గులాబి పూలు వాడిపోయాయ్. పాపం మితిలేని ఆశ, అంతులేని దుఃఖం. ఆమె అడుగుదామనుకున్నది, "కారణమేమిటి" అని. కాని ఆమెలో అడిగే శక్తికూడా లేదు. అడిగినా బ్రతిమాలినా ప్రయోజనం లేదు. ఎండమావులో నికి దాహం తీర్చుకోడానికి పోయినట్లయింది. అతని నిరాడంబర జీవితం ఆమెను మోసపుచ్చింది. ఆ మోసంలో ఆమెకు హృదయ పరిశీలనాశక్తి చనిపోయింది. ఎంత వివేచనాపరురాలైనా ఒక్కొక్కప్పుడు అలాగే అవుతాడనుకుంటూ. పాపం! ఆమెకు అతనితో ఇంక మాట్లాడాలని అనిపించలేదు. అగ్ని గుండంలో పడ్డదాని మోస్తరుగా అయిపోయింది. మలయానిలం వెచ్చగా వస్తోంది. పొగడపూలు వాడిపోయి రాలిపోతున్నయ్యి. ఆమె అక్కడ నుంచి లేచింది. గోపి ఆమె బలహీన స్థితిని చూసి చాలా దుఃఖపడ్డాడు. "ఓ అమాయకపు స్త్రీ హృదయంలో అనలం పుట్టించానుకదా! పోనీ! ఆమె నన్ను ప్రేమించే మొదటిక్షణాల్లో తనవలపును సూచనగానైనా తెలియపరచివుంటే చెప్పేవాణ్ణిగదా!" అనుకున్నాడు. "నాకోసం ఎదురుచూస్తున్న కోమల హృదయాన్ని ఎలా నాశనంచేయను. ఆమె నాకోసం కలలుకంటూ ఉంటుంది. ఆమెను నాశనం చేయలేను. అబ్బ! ఎంత ప్రళయం. పోనీ నా స్థితినంతా చెప్తే! ఆమె వినదు. ఆమెలో వీస్తున్న సుడిగాలి మ్రోతలో నా ఆర్తనాదం వినిపించదు, వినిపించదు".

ఆమె రెండడుగులు ముందుకు వేసింది.

" సోదరీ " అన్నాడు. ఆమె వినిపించుకో లేదు. ఇంకా రెండడుగులు ముందుకు వేసింది. " పార్వతీ " అన్నాడు. ఆమె నిలబడింది. కాని మళ్ళీ నడుస్తూనే "మీరేం నాకు తోడురానక్కరలేదు. నన్నే పిశాచాలూ పీక్కు తినవు. తిన్నా ఫరవాలేదు." అని అన్నది. అతను కూడా ఆమె వెంట నడిచాడు రెండు గజాలు. కాని ఆమె మరీ బాధ పడుతుందేమోనని వెనక్కు తిరిగాడు." అతని మనస్సాగలేదు. ఆమె విన్నా వినకపోయినా తన స్థితినంతా చెప్దామనుకున్నాడు. ముందుకు నడిచాడు. కాని అతని కాళ్ళల్లో శక్తిచచ్చిపోయింది. వణికిపోతున్నాయ్. నడవలేక పోతున్నాడు. ఆమె స్థాణువుగా కనుపిస్తోంది. చేయగలిగింది లేక అలాగే చూస్తూ నిలబడిపోయినాడు.

ఆమె తలలో వాడిపోయిన గులాబి పూల వాసన మాత్రం మిగిలింది.